క్లుప్తంగా

చంపాడులో 104 వైద్య సేవలు



చంపాడు(వేమూరు): చంపాడు గ్రామ ప్రజలకు 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించడం జరిగిందని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. గ్రామంలో సోమవారం 104 వాహనం ద్వారా 60 మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి ఆటలు దోహదం

తెనాలి టౌన్: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆటలు దోహదపడతాయని సెయింట్ పాల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ డైరెక్టర్ చావాలి ఆకుల్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం మారీసుపేటలోని స్కూలులో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల మరో డైరెక్టర్ చావాలి తేజోనాథ్ మాట్లాడుతూ ఆటలతో విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో చోరీలు

కొల్లిపర: మండలంలోని రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వల్లభాపురానికి చెందిన కొండా సర్వేరెడ్డి మూడు రోజుల కిందట ఇంటి నుంచి సెంటర్‌లో ఉన్న దుకాణానికి వెళ్లారు. గంట తరువాత తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియ వ్యక్తి చొరబడి బీరువాలో ఉన్న రూ.లక్షను అపహరించాడు. దీంతో సర్వేరెడ్డి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో ఆళ్ల భూషిరెడ్డి ఇంటిలో ఎవరు లేరన్న విషయాన్ని తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తాళాలు పగులగొట్టారు. బీరువాలో ఉన్న 40గ్రాముల బంగారం, రూ.50వేలను ఎత్తుకు పోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు వదిలిపెట్టి రెండు, మూడు రోజులు బయటకు వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. గ్రామంలో అనుమానంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వరుస దొంగతనాల నేపథ్యంలో మండలంలో పోలీస్ నిఘా పెంచనున్నట్లు తెలిపారు.

దాడిపై కేసు నమోదు

తెనాలిరూరల్: స్వల్ప విషయమై యువకుడిపై దాడి చేసి గాయపర్చడంపై కేసు నమోదైంది. పట్టణ పినపాడుకు చెందిన శ్రీరామ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఇంటికి వచ్చిన అతను ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలసి దుండిపాలెం డొంక రోడ్డులో మాట్లాడుతున్నాడు. అక్కడికి సమీపంలో కొందరు యువకులు మద్యం తాగుతుండగా వారి గురించే శ్రీరామ్ మాట్లాడుతున్నాడని ఘర్షణ పడి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ ప్రకాశరావు తెలిపారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్ : కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కొలకలూరు ఫ్లై ఓవర్ కింద సుమారు 55 ఏళ్ల వ్యక్తి ఈ నెల 21వ తేదీ సాయంత్రం నిద్రపోతుండగా. అతనిపై కారు ఎక్కింది. తీవ్రంగా గాయపడిన అతన్ని గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: వేర్వేరు ఘటనల్లో జూదరులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆకస్మిక దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3,500 స్వాధీనం చేసుకున్నారు. సాలిపేటలో పేకాట శిబిరంపై వన్‌టౌన్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 42,400 స్వాధీనం చేసుకున్నారు.

అరవపల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధం



తిరునాళ్లకు ముస్తాబైన అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవస్థానం

- నేటి నుంచి తిరునాళ్ల ప్రారంభం
- తొలిరోజు పశు ప్రదక్షిణలు



బాలకోటేశ్వరస్వామి మూలవిరాట్



తిరునాళ్ల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రేపల్లె మండలంలోని అరవపల్లి గ్రామంలో శ్రీబాలకోటేశ్వరస్వామి దేవాలయానికి స్థలపురాణం ఉండటంతో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. మూడు రోజులపాటు జరుగనున్న అరవపల్లి తిరునాళ్ల మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. తిరునాళ్లకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భక్తులు బాలకోటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు వీలుగా బారికేడ్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. తలనీలాలు సమర్పించుకునేందుకు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లను సిద్ధం చేశారు. 25వతేది మంగళవారం పశుప్రదక్షిణ, 26న మహాశివరాత్రి, 27న ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అరవపల్లి దేవాలయా అధికారులు సిద్ధం చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆలయ తిరునాళ్ళ విజయవంతం అయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునే విధంగా చర్యలు చేపట్టాం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు నిబంధనలు పాటించి సహకరించాలి.

– దివి వెంకట అప్పలాచార్యులు, ఆలయ ఈఓ, అరవపల్లి

బాలకోటేశ్వరస్వామికి ఘన చరిత్ర...

అరవపల్లిలో వేంచేసియున్న శ్రీబాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి 300సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. పూర్వం ప్రస్తుతం దేవాలయం ఉన్న ప్రాంతంలో ఓరైతు పొలాన్ని దుక్కు దున్నుతుండగా నాగలి కొర్రికి శివలింగ ఆకారంలోని ఒక రాయి తగిలి బయట పడింది. ఆరైతు దానిని పచ్చడి బండగా భావించి ఇంటిలో వాడుతున్నారు. కొన్ని రోజులకు గుండ్రాయి నుంచి మంట శరీరమంతా మంట అని శబ్దం రావటంతో పాటు ఇంటిలోని వృద్ధురాలికి పూనకం వచ్చి నేను బాలకోటయ్యను శరీరమంతా మంట స్నానం చేయించండి.. నాకు గుడి కట్టించండి అని పూనకంలో పలికింది. దీంతో రైతు సంబరపడి సమీపంలోని ఊలుపాలెం జమీందార్‌కు తెలియజేశారు. అయితే అక్కడే ఉన్న నరసరావుపేట జమీందార్ రావు బహదూర్ శ్రీవిజయకృష్ణ గూండారావు జమీందార్ దేవాలయాన్ని తామే నిర్మిస్తామని చెప్పి నిర్మించారు. అలా 300 సంవత్సరాల క్రితం ఆలయం నిర్మితమైందని పెద్దలు చెబుతుంటారు. ఇక్కడి తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

రోడ్లు ఇలా.. తిరునాళ్లకు చేరేదెలా..?



అరవపల్లి కాల్వ వంతెన నుంచి రేపల్లె వచ్చే మార్గంలో గతుకులమయంగా ఉన్న రహదారి



అరవపల్లి కాల్వ వంతెన నుంచి బాలకోటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఛిద్రమైన రహదారి



ఓల్డ్‌టౌన్‌లో అరవపల్లి వెళ్లే మార్గంలో రహ'దారిద్ర్యం'

రేపల్లె మండలం అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని జరిగే తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. రేపల్లె నుంచి అరవపల్లి ఆలయానికి చేరుకునే ప్రధాన రహదారి పలుచోట్ల అధ్వానంగా ఉండటంతో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సత్వరం ఆయా రోడ్లకు మరమ్మతులు నిర్వహించి అనుసంధానం చేయాలని ప్రజలు కోరుతున్నారు. – రేపల్లె రూరల్

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు తెలపండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

చెరుకుపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఓటర్లను బెదిరించి, భయపెట్టి, ప్రలోభాల ద్వారా అక్రమ దారిలో గెలవాలని చూస్తున్నారని దీనిని ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్ అందరూ గమనిస్తున్నారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సోమవారం మండలంలోని కావూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా అభ్యర్థి గెలుపు నల్లేరు మీద నడకే అంటూ.. మాదే విజయం అంటూ గొప్పలు చెప్పుకున్న కూటమి నాయకులు నేడు రోజు రోజుకు లక్ష్మణరావుకు వస్తున్న ఆదరణ చూసి, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా కొన్ని మండలాలలో కూటమి అగ్ర నాయకుల వద్ద మెప్పు పొందేందుకు పోలింగ్ బూతులను స్వాధీనం చేసుకుని రిగ్గింగ్ కు పాల్పడే అవకాశాలు ఉన్నాయని, ఓటింగ్‌కు రాని వాళ్ల ఓట్లు మేమే పోల్ చేసుకుంటామని ఎవరు అడ్డొస్తారో చూస్తామని కొన్ని చోట్ల కూటమి నాయకులు బహిరంగంగానే మాట్లాడుతున్నారని రమాదేవి మండి పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్, ఎస్పీలు పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కె.శరత్, సీపీఎం నాయకులు సూర్యనారాయణ రెడ్డి, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో ప్రచారం..

నిజాంపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పి.నరసింహారావు అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో పట్టభద్రులు లక్ష్మణరావుకు తమ ఓటును వేసి గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం నిజాంపట్నంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా -గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న లక్ష్మణరావు అసెంబ్లీలో నిరుద్యోగుల, పెన్షనర్‌ల, రైతులు, కార్మికుల సమస్యలను గళమెత్తుతారన్నారు. పట్టభద్రులు తప్పనిసరిగా లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, ప్రజాసంఘాల నాయకులు బాబూరావు, ఆనంద్, రత్నరాజు, సాయిప్రసాద్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత రాష్ట్రానికి కృషి చేద్దాం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ రాజశ్రీ



మార్కెట్ సెంటరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

రేపల్లె రూరల్: సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ రాజశ్రీ తెలిపారు. నాటుసారా, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. పెదకూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాటుసారా తాగి, ఇతర మాదక ద్రవ్యాలను తీసుకొని జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. నాటుసారాతో గ్రామీణ ప్రాంతాలలో అనేక మంది తమ కుటుంబాలను సైతం నాశనం చేసుకున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి బారినపడి యువత బంగారం లాంటి తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను చిదిమివేసే నాటుసారా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చట్టవ్యతిరేకమైన పదార్థాలు ఎవరైనా విక్రయించినా, తయారు చేసిన తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మేధో వికాసానికి కృషి చేయాలి

తెనాలి టౌన్: చిన్నారుల మేధో వికాసానికి అంగన్‌వాడీలు కృషి చేయాలని ఎంఈవో వి.జయంతి బాబు పిలుపునిచ్చారు. స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ హైస్కూలులో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఐదో రోజు సోమవారం కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లకు లెర్నింగ్ మెటీరియల్‌ను ఎంఈవో అందజేశారు. పిల్లల శారీరక, మానసిక మేధోభివృద్ధికి అవసరమైన పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో డాక్టర్ ఎం.సునీత, డీఆర్పీలు కె.సౌజన్య, రామరాజు, సీఆర్‌ఎంటీలు శ్రీదేవి, దీపాంజలి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ హుస్సేన్, సీహెచ్. రాము, రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీశైల భక్త సేవా సమితి సేవలు అభినందనీయం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

తెనాలి టౌన్: శ్రీశైల భక్త సేవా సమితి సేవలు అభినందనీయమని డీఎస్పీ పి.జనార్దనరావు కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని దేవిప్రియ ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానానికి ఏటా సమితి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే 78వేల మంది భక్తులకు సరిపడా ఉచిత ప్రసాదం, మంచినీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలను గత 17 సంవత్సరాలుగా సేవాసమితి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ధార్మిక కార్యక్రమంలో భాగస్వామిగా చేసినందుకు సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. అనంతరం సరుకులతో ఉన్న లారీలను సమితి సభ్యులు శ్రీశైలం పంపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు వ్యసనం నుంచి బయట పడాలి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో వడ్డేశ్వరం గ్రామంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సోమవారం వివరించి, అవగాహన కల్పించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. సిగరెట్, బీడీ, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల నోరు, గొంతు తదితర అవయవాలకు కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. గుండె, ఊపిరితిత్తుల అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, యోగ, ధ్యానం, వ్యాయామం, కుటుంబ సభ్యుల మద్దతు ద్వారా పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి బయటపడవచ్చని విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ సూచించారు. అనంతరం గ్రామస్తులకు రక్తపోటు, బరువు, ఎత్తు పరీక్షలు నిర్వహించి బీఎంఐపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకురాలు డాక్టర్ టి.శ్రావణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ, సమన్వయకర్త పి.సురేష్, వలంటీర్లను యూనివర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.

విద్యతోనే మనిషి జీవితంలో మార్పు



పరీక్ష సామగ్రి అందజేస్తున్న నారాయణ

తెనాలి టౌన్: విద్యతోనే మనిషి జీవితంలో మార్పు సాధ్యమని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్ తెలియజేశారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గుమ్మడి వెంకట నారాయణ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ప్రతి మనిషి జీవితాన్ని ఉన్నత స్థితికి చేర్చుతుందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థి భవిష్యత్‌కు మలుపుగా తెలిపారు. ఉన్నతంగా చదువుకుని జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా దాత ఈ సేవ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా దివ్య కల్యాణ వేడుకలు ప్రారంభం



మయూర వాహనంపై స్వామి ఊరేగింపు

తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ పర్వతవర్ధిని సమేత శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో మహా శివరాత్రి పురస్కరించుకుని పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మయూర వాహనంపై సోమవారం స్వామి ఊరేగింపు దేవస్థానం నుంచి ప్రారంభమైంది. పురవీధులల్లో అట్టహాసంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామిని దర్శించి టెంకాయలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమణ కుమారి మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 28వ తేదీ వరకు దేవస్థాన ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న శేష వాహనసేవ, నందివాహన సేవ, 26న లింగోద్భవ కాల అభిషేకాలు, ఎదురు కోలోత్సవం, దివ్య కల్యాణం, నంది వాహన సేవ, దివ్య రథోత్సవం, 28న వసంత మంటప సేవ, పుష్పయాగం జరుగుతాయని వివరించారు. శివరాత్రి రోజు భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని దేవాలయంలో క్యూలైన్లు, మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.